# ధర్మవాహిని



భగవాన్
శ్రీ సత్యసాయిబాబా

I

# ధర్మం జీవకోటి మనుగడకు ఆధారం

**ఆత్మశాంతికి, విశ్వశాంతికి ధర్మాచరణ చేయవలెను :**

ఆత్మశాంతికి, అఖిల విశ్వశాంతికి, మానవులు ధర్మదీక్ష వహించవలెను; ధర్మాచరణం చేయవలెను. ధర్మమయజీవనుడు కానివాడు ఆత్మశాంతి పొందలేడు. హరిప్రీతి కలిగించలేడు. ధర్మం ప్రపంచ జీవకోటియొక్క మనుగడకు ఆధారభూతం; సర్వకాలిక సత్యం. ధర్మమయ జీవనము తరుగునపుడే లోకం కడగండ్లకు, కల్లోలాలకు గురి అవుతుంది. ధర్మజ్యోతి ప్రకాశం వెలుగొందని స్థానములో శోకాంధకారం క్రమ్ముకొంటుంది.

భగవంతుడు ధర్మదేవత, ధర్మప్రియుడు, ధర్మపాలకుడు, ధర్మస్థాపకుడు, ధర్మస్వరూపుడు. మన వేదశాస్త్ర పురాణేతిహాసములు, ధర్మ ప్రాశస్త్యమును గూర్చి ప్రశస్తంగా ఉద్ఘోషించుచున్నవి. వివిధ మతశాస్త్రాలు కూడా వానివాని పరిభాషల్లో ధర్మప్రాధాన్యమును ప్రబోధించినవి. ధర్మనారాయణుని, ధర్మస్వరూపుణ్ణి ఆరాధించుట ప్రతి మానవునకూ కర్తవ్యం.

ధర్మకర్మవాహిని యేనాటికి ఎండి పోయెడిదికాదు. అది యెక్కడ యెండిపోవునో, అక్కడ సంపూర్ణ వినాశవే ఫలితము. అంతర్వాహినియైన సరస్వతివలె ధర్మకర్మ అవ్యక్తముగా లోనిజాలుగా నైనా ప్రవహిస్తుండబట్టే, ప్రపంచము ఇంతవరకు జీవించియున్నది.

ధర్మము మానవకోటికే కాదు, పశుపక్షి మృగాదులకుకూడా అవసరము. అవికూడా యథాశక్తి ధర్మమును నిర్వహిస్తూ వుండును. కాన, ధర్మవాహిని సువ్యక్తముగా, సంపూర్ణముగా ప్రవహించవలెను. అప్పుడు లోకము సమస్త సుఖములనూ పొందుతుంది. ధర్మతత్త్వవిశేషములు తగినంతగా విదితములు కాక పోవటముచేతనే ప్రపంచరంగముపై అనర్థము తాండవిస్తూ వున్నది. ధర్మహృదయమును మానవులు సక్రమరూపంలో గ్రహించవలసివున్నది. అయితే ధర్మమంటే ఏమి? ధర్మతత్త్వమంటే ఏమిటి? ప్రతి వ్యక్తి ధర్మమును సమాచరించ వీలగునా? ధర్మమును ఆచరించిన, లోకమున సాధారణ మానవులు సైతము సక్రమముగా జీవించగలరా? ఇత్యాది విషయములు ప్రతి మానవునకునూ వచ్చు సందేహములే. వానినే తెలిసికొనవలెను. అది అత్యవసరము.

**వైదికమైన ధర్మతత్త్వమును ప్రతి మానవుడు తెలిసికొనవలెను :**

ధర్మమనగానే సాధారణ మానవులందరికీ దానాలు చేయటము, ఉచితముగా సత్రములు కట్టించటము, వారి వారి వృత్తుల ననుసరించి ప్రవర్తించటము, న్యాయమును తేల్చటము, మంచి చెడ్డలను వేరువేరు పరచటము, ఇష్టము వచ్చినట్లు మనసు పోయినట్లు పోవటము, తన సంతోష సుఖములు మాత్రమే తాను ఆశించటము, వానికి తగిన ఉపాయములు పన్ని తన అభీష్టమును నెరవేర్చుకొనటం, ఇట్టివేకదా ధర్మాలంటే, అని బహుజనుల తలంపు! ధర్మముయొక్క స్వచ్ఛస్వరూపం గుర్తుపట్టలేనంతగా మాసిపోయి చాలాకాలమయింది. కాలగమనములో మంచిమంచి

స్థలములు, వనములు గడ్డముండ్లు పెరిగి మాసిపోవటం, మంచి మంచి వృక్షములన్నియూ కొట్టివేయబడి వనముల రూపు మారిపోవటం, లోకంలో సహజముగా ప్రతివ్యక్తి చూచుచునే యున్నాడు; అది కడకు సహజమయినది.

మన వేదశాస్త్ర పురాణాదులలో వర్ణింపబడిన ధర్మవిశేషమును ధర్మతత్త్వముయొక్క రూపచిత్రములను, ప్రతి మానవుడూ తెలిసికొనవలెను. అవి అంతకంతకు అపరిణత హృదయములచేత, పెడబుద్ధులచేత అపార్థం చేసికోబడి వికృతరూపం పొందినవి. వాని అంతస్సూత్రం విస్మృతమైనది. ఆకాశవర్షధారలు క్రిందికి వచ్చి వచ్చి, భూవాసనలు తగిలి కలుషితములయిన విధముగా, సనాతన వైదికఋషుల దివ్యభావ ధారలు, కర్మాచరణలు, ఆచార రహస్యములు, క్రమక్రమముగా ప్రాకృత పండితుల జడబుద్ధులను స్పృశించి, వికృత వికల కలుష రూపములను ధరించినవి.

చిన్న పిల్లలకు పాఠాలు అర్థము కావటానికి వాచక పుస్తకముల పైన తత్సంబంధములైన బొమ్మలు వేస్తే అమాయకులైన పిల్లలు బొమ్మలతోటి ప్రొద్దుపుచ్చునట్లు, గంభీరమైన సత్యమును సుగ్రాహ్యం చేయటానికి యేర్పరుపబడిన కొన్ని కొన్ని స్థూలకర్మ కలాపాలను, క్రమక్రమముగా మూఢులు, అమాయకులు విభ్రాంతులై సత్యమును విస్మరించి వికారపరచినారు. పరిశుభ్రమయిన, అందమయిన, మంటపాలను బాధ్యతలెరుగని బాటసారులు వికారం చేసినట్లు, తామసిక ప్రవర్తనగల వ్యక్తులు వేద మర్యాదలను మాపి లోకమునకు వంచన చేకూర్చుచున్నారు.

**విశ్వాత్మయైన పరమాత్మతో సమైక్యమును పొందుటే ధర్మము :**

జగతిలో ఇట్టి ధర్మగ్లాని ఏర్పడిన ఒకానొక ఆపత్సమయములో, ధర్మస్వరూపం అసురసమాజముచే విపర్యయ మొందిన కాలమందు సురల పిలుపు వినబడి, భగవంతుడు అవతరించి హత్యాకాండగా మారిన వేదధర్మకర్మలను సత్యధర్మకర్మగా మార్చి లోకసంగ్రహం చేసినాడు.

ఇప్పటి అంధత్వాన్ని ఎవరు తీసివేయగలరు? మానవుడు తనలో అరిషడ్వర్గములనే పశువులను సంహరించి తన పరిశుద్ధాత్మను విశ్వేశ్వరునకు సమర్పించుట, అనేదే ధర్మము.

బుద్ధుడు భగవంతుని 'ధర్మము' అనే పేరుతోను, వేదమును 'విజ్ఞానము' అనే పేరుతోను, పిలిచి వేదధర్మోద్ధరణం చేశాడు. అప్పుడు వేదముల పేరుచెప్పిన, ఆనాటి సోమకాసురు లాతని బ్రతుకనివ్వరు. అందుకనే ఆయన వేదహృదయమును స్వీకరించి ఆపద్ధర్మము ననుసరించి వేదశబ్దమును పైకి పలుక లేదు; కానీ, ఆయన వేదమయుడు, దైవమయుడు! బుద్ధుడే నాస్తికుడైతే ఆస్తికుడెవడు? ఆయన జీవితమంతా ఒక మహా ధర్మం.

శంకరుడు ధర్మకర్మపథ వ్యతిరేకి అని కొంతమంది తలంపు. శంకరుడు స్వార్థధర్మకర్మపథ వ్యతిరేకి మాత్రమే. ఆయన జ్ఞాన చోదితమైన సత్యధర్మ కర్మను లోకములో ప్రకటితము చేసిన మహాచార్యుడు. శంకరుని ధర్మకర్మనిష్ఠను, బుద్ధుని వేదవిశ్వాసమును గ్రహించటానికి ఉన్నతదృష్టి అవసరము. అట్టి

దృష్టి లేనివారికి అపార్థముల జాడ తప్ప, యథార్థముల జాడ తెలియదు. ఎత్తైన శిఖరము నెక్కవలెనన్న ఎత్తైన నిచ్చెన అవసరముకదా? తన అహంకారమును, తన స్వార్థమును, తన పాశవిక ప్రవృత్తిని తన దేహదృష్టిని బలిచేసి, విశ్వాత్మయైన పరమాత్మతో సమైక్యమును పొందటమే, ధర్మమందురు.

**అజ్ఞాన, అహంకార, మమకారములను జ్ఞాన వేదికపై బలిచేయి:**

సమస్త లౌకికవిషయాలయందు ఔచిత్యభంగము కాని మాటలు, హృదయద్రోహము కాని పనులు, సమయస్ఫూర్తి మార్పులు, స్వార్థరహితమైన నడకలు, భగవత్‌రతి గల భావములు, సత్యాన్వేషణము - ఇవియే నిజమైన ధర్మములు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" 'ఇదంతా బ్రహ్మమే' అన్న జ్ఞానాగ్నిలో స్వార్థము, కామములతో కూడిన సమస్త లౌకిక విషయాలను సంపూర్ణముగా ఆహుతి చేసి, బ్రహ్మైక్యానంద రసపాన ప్రమత్తుడు కావలెను. అదియే ధర్మకర్మ పరమార్థము.

అజ్ఞానమును అహంకారమమకారములను జ్ఞానవేదికపై బలిచేయి! ధర్మమును గూర్చిన వేదాశయ మిదే; బ్రహ్మదృష్టితో చేసిన బ్రహ్మైక్యానంద శ్రీకి దారితీసే ప్రతి నిస్స్వార్థకర్మ కూడా, ఒక ధర్మమే! ఇట్టి ప్రతి ధర్మకర్మయూ బ్రహ్మజ్ఞాన మహాధర్మ సముద్రమున సంగమించే ఒక పుణ్యవాహినియే. వివిధ ధర్మములూ వివిధ విధానాలతో ఆరాధించే ప్రక్రియలే. నిస్స్వార్థమైన బ్రహ్మార్పణదృష్టిగల ప్రతి పుణ్యకర్మ కూడా బ్రహ్మధర్మమునకు ఉపాంగమైన ఒక విశిష్టధర్మమే. భారతీయ జీవనవ్యూహ

పరమార్థం, జీవితమును ఈశ్వర ప్రీతికరమైన, కల్యాణమయమయిన ఒక బ్రహ్మధర్మంగా చేయటమే.

**జీవుడు స్వస్వరూపమైన దేవుని పొందుటయే ధర్మాశయం :**

ప్రాచీన ధర్మకర్మ కలాపములను మనము సాంకేతికముగా గ్రహించవలసియున్నది. ఆధ్యాత్మిక పరిభాషాజ్ఞానంతో ఇపుడు మనము శాస్త్రాలను సమీపించవలసియున్నది. అపుడే లోకము శాస్త్రబోధలను సరిగా సందర్శింపగలదు. చూడు! ఒక ఉపమానము తీసికొందము; పూర్వము అనేకులు యజ్ఞములు సలిపెడివారు. యజ్ఞములో చేయవలసిన పశుబలి మూమూలు ఈ నోరులేని అజ్ఞాన పశువులను బలిచేయటము కాదు. అవి తెలియకుండానే ఒకరకంగా యజ్ఞజీవనం చేస్తున్నవి. చేయవలసిన పశువధ, ఈ పశువధకాదు. ఆధ్యాత్మిక శాస్త్ర పరిభాషలో అసలు పశువంటే జీవ భావమని, శారీరక దృష్టి అని, అహంకారమని అర్థము. జీవ దశయే పశుత్వము. మనం చూచే పశువులు అసలు పశుత్వమునకు ఉదాహరణములు మాత్రమే.

ఇట్లే ధర్మమునకు అసలు ఆధ్యాత్మికశాస్త్ర పరిభాషలోని అర్థము. ఇప్పుడు జరుగుచున్న ధర్మకర్మములయొక్క భావముపై యజ్ఞమును పోలియున్నది. పరమాత్మకు పశుపతి అనియూ, గోవిందుడనియూ పేర్లు కలవు. పశుపతి అంటే జీవులకు అధిపతి అని. గోపాలుడన్నను అదే అర్థము. జీవులను పాలించువాడని. గోవులను కాయటమువలననే గోపాలుడు కాలేదు. మామూలు గోపాలనము జీవపాలనమనే; గోపాలనము ప్రకటించే ఒక

ప్రదర్శన చర్య మాత్రమే. భగవత్ తత్త్వమువలె, భగవత్ శాస్త్రాలు కూడా గంభీర అర్థవంతాలు. జీవుడు తన ప్రకృతిదృశ్యములను, వాసనలను విడిచి స్వస్వరూపమైన దేవుని పొందటమే ధర్మాశయం.

**జీవునిలో శివుని దర్శించుటయే పరమార్థము :**

గంభీర విషయాలను, వేదరహస్యాలను ఆబాలగోపాలం గ్రహించవలసి యున్నది, చూడు! ఒక ఉపమానము తెలిసికొనిన, ప్రాచీన ధర్మమెట్టిదో, యిప్పటి అర్థమెట్టిదో నీకే బోధపడగలదు. శివాలయములు చూడని భారతీయుడుండడని తలంతును. ఆ దేవాలయములో శివుని కెదురుగా ఒక నందిని చూతుము. దాని భావమేమని? ఇప్పటి అర్థము ఈశ్వరుని వాహనమైన ఒక కోడె అనియు, బసవణ్ణ అనియు తలంతురు. కాని ప్రాచీనకాలపు శాస్త్రము వేరు! శివలింగం ఈశ్వర ప్రతీక అనియు, నంది జీవ ప్రతీక అనియు జీవేశ్వరులమధ్య విభేదం చూడగూడదనియు, శివలింగానికీ, నందికీ మధ్య యెవ్వరూ పోకూడదనియు, అలనాటి యాచారము! నంది శృంగముల మధ్యములోనుంచి శివలింగ దర్శనం చేయటం మహాపుణ్యమని ఇప్పటివారు భావింతురు. యథార్థమయిన అర్థమును తెలియనివారగుటచే అటుల భావింతురు. కానీ, దాని అంతరార్థము అది కాదు. జీవునిలో శివుని దర్శించుమనియే పరమార్థము. పశువు పశుపతికి వాహనము అనగా, అంకితము అయినపుడు, నంది, ఈశ్వరుడు రెండు రూపములు, రెండు భావములు కాక అపుడు నందీశ్వరుడను ఒకే నామరూపములను స్వీకరించును. అప్పుడు అది ఆరాధనీయ

మవుతుంది. పశువు ఈశ్వరార్పితమై ధన్యత గాంచటమే ఆనాటి యజ్ఞములయొక్క యథార్థ పరమార్థము.

కానీ ఈనాటికి వాని మార్పులు సంబంధము లేనివిగా మారినవి. ఇట్లే, ఆనాటి ధర్మకర్మ పరమార్థములు. నేటి అసత్య ధర్మకర్మ అర్థములు, ఒకదానికొకటి సంబంధము లేనివై యున్నవి. లౌకిక ధర్మకర్మలు సహితము పరమార్థ సారము ననుసరించే యుండవలెను. అపుడు అమాయకపు ప్రజలు యథార్థమును పాటించగలరు. వివేకదృష్టి లేనపుడు వివేకమయ కర్మకూడ వినోదకర్మగా మారిపోతుంది. ఒకానొక సమయమున ప్రహ్లాదుడు కూడ అనియుండెను; "అహంకార పశువును చంపటము చాలాకష్టము కనుక, దుర్బల మానవులు ఈ నోరులేని పశువుల వెంట పడటమే యజ్ఞమనుకొనుచున్నారు". ఇట్టి జంతుబలి తమోగుణ సంబంధమయిన పథం! అహంకారబలి సాత్త్వికగుణ పూర్ణమయిన పథం.

చూడు! వీని అంతరార్థమెంత గంభీరంగా ఉన్నదో! ఇట్లే ప్రతి ఒక్కటియూ! ఆనాటి పరమార్థము, నేటి పరమార్థమూ సంబంధము లేనివై పెరిగినవి; కొమ్మలు విరిగినవి. అట్టి వృక్షములను నేడు వేర్లవరకు పెరికి నూతన భావములు నాటుటకు సాధ్యము కాని సమయము కనుక, ఉన్న చెట్లనే సరియైన మార్గమున పెరుగునట్లు, కనుపించునట్లు, పరమార్థములు స్మరించునట్లు చేయవలెను.